# సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం, 12, ఏప్రిల్, 2024






**మృత్యువులోనూ 'తోడు'గా..**

వారిద్దరూ అన్నదమ్ములు. ఒకే మాటగా ఉంటూ తోడుగా ముందుకెళ్తుండేవారు. ఆ అన్యోన్య తను చూసిన విధికే కన్ను కుట్టిందేమో.. ఇద్దరి ప్రాణాలనూ ఒకేసారి తీసుకుపోయింది. -8లో



**పెరుగుతున్న టమాట ధరలు**

అన్నమయ్య జిల్లాలోని మార్కెట్లలో టమాట ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. వారం క్రితం కిలో రూ.12 ఉన్న ధర ప్రస్తుతం రూ.30 వరకు చేరుకుంది. -8లో

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 40.2/23.4

జిల్లాలో గురువారం 23.4 - 40.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### పెద్దదర్గాను దర్శించుకున్న ఎంపీ



పెద్దదర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

**కడప కల్చరల్:** కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం కడప అమీన్ పీర్ దర్గాను దర్శించుకున్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ఆయన దర్గాకు విచ్చేశారు. నిర్వాహకులు ఆయనకు సంప్రదాయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన తొలుత ప్రధాన గురువుల మజార్ల వద్ద, అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మాజర్ల వద్ద ప్రార్థనలు చేశారు. దర్గా ముజావర్ అమీర్ ఆయనకు దర్గా విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

**వాల్మీకిపురం:** వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన, మొదటి గంట, బలి, శాత్తుమొర తదితర సేవలను జరిపారు. సాయంత్రం ఆలయంలో కలశస్థాపన, హోమాది కార్యక్రమాల అనంతరం అంకురార్పణ నిర్వహించారు. అలాగే రామ భక్తులు శ్రీరామ దీక్ష వ్రతమాలను ధరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ అధికారులు క్రిష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణరాజు భట్టర్, కృష్ణప్రసాద్ భట్టర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

- శ్రీ పట్టాభిరాముడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం ధ్వజారోహణం, ఊంజల్ సేవ, రాత్రి గజ వాహన సేవ నిర్వహించనున్నారు.

### 448 ఫిర్యాదులకు పరిష్కారం

**కడప సెవెన్‌రోడ్స్:** జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘనపై.. మొత్తం 450 ఫిర్యాదులు అందగా.. 448 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటారు. అందులో భాగంగా.. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు.. కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్.. ఫిర్యాదుల పరిష్కార నివేదికను విడుదల చేసింది. మొత్తం 450 ఫిర్యాదులు అందగా.. 448 ఫిర్యాదులకు పరిష్కారం అందగా 2 ప్రోగ్రెస్ లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రూ.2,55,45,350 నగదు, రూ.1,69,66,734 విలువైన లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేశారు. అలాగే 715 ఎఫ్.ఐ.ఆర్ కేసులు నమోదు చేశారు.

### నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



సీతారామ లక్ష్మణ మూలవిరాట్

**ఒంటిమిట్ట:** ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 12వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిచనున్నారు. ఏప్రిల్ 17 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 12న తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలుపుతారు. అనంతరం ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణ చేస్తారు. తర్వాత భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

# సమత.. మమత.. మానవత

- జిల్లావ్యాప్తంగా ఈదుల్ ఫితర్ వేడుకలు
- మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు



పండుగ సందేశం ఇస్తున్న ముఫ్తీ న్యామతుల్లా



రంజాన్ సందర్భంగా కడపలోని బిల్టప్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

**కడప కల్చరల్:** ప్రశాంతమైన వదనాలు..చిరునవ్వులతో పలకరింపులు..భక్తులందిరిలోనూ ఆధ్యాత్మిక భావనలు...అందరూ ఏకేశ్వరుడైన అల్లాహ్ గురించే 'తక్బీర్'చెబుతున్నారు. అల్లాహ్‌పైన గల అచంచల విశ్వాసాన్ని నిరూపించుకునేందుకు తహతహలాడారు. మనసునిండా అల్లాహ్ బోధనలే. ప్రతి భక్తునికి మరో భక్తునితో ఆధ్యాత్మికతమైన బాంధవ్యం పెనవేసుకుంటున్న దృశ్యాలు. ఆత్మీయతకు ప్రతిరూపంగా ఆలింగనాలు. ప్రపంచమంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, సోదరాభావం వెల్లి విరియాలని ముస్లిం మత గురువులు మనసారా ఆకాంక్షించారు. పవిత్రమైన రంజాన్ (ఈదుల్ ఫితర్) పండుగ ప్రత్యేక ప్రార్థనలు గురువారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7.00 గంటల నుంచి ప్రారంభమైన ప్రార్థనలు మధ్యాహ్నం 12.30 గంటల వరకు సాగాయి. కొందరు మసీదులలో ప్రార్థనలు చేయగా, ఎక్కువ మంది సమీపంలోని ఈద్గాలలో సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు.

**రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలి**

కడప నగరం బిల్టప్ ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మత గురువులు ముఫ్తీ న్యామతుల్లా పండుగ సందేశాన్ని అందజేశారు. అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు నమాజే ఏకైక మార్గమని పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రంజాన్‌మాసం అనంతరం కూడా నమాజ్ ప్రార్థనలను వీడబోమన్నారు. దేవుని కృప కటాక్షాలకు నమాజ్‌కు మించి మార్గం లేదన్నారు. విలువైన మానవజన్మ ఇచ్చినందుకు జీవితాంతం ప్రార్థనలతో కృతజ్ఞతలు తెలుపుకుంటామన్నారు. జిల్లా వాసి పాలకుడిగా ఉండడం జిల్లా వాసులకు ప్రత్యేక ఆనందం ఇస్తోందని, రానున్న ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్రమంతటా సుభిక్షంగా ఉండాలని, కరువు కాటకాలు రాకూడదని ఆకాంక్షిస్తున్నామన్నారు. అనంతరం పీఠాధిపతి ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు సాగాయి. ప్రపంచమంతటా శాంతియుతంగా ఉండేలా కరుణించాలని, దేశం, రాష్ట్రం, మన జిల్లా సుభిక్షంగా ఉండాలని కోరారు.అనంతరం పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ భక్తులచే ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన ఆశీస్సులు అందుకునేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. ప్రాంగణంలో ముస్లిం సోదరులు సంతోషంతో ఒకరినొకరు హత్తుకుని 'ఈద్ ముబారక్'చెప్పుకున్నారు.



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



బిల్టప్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పెద్ద దర్గా పీఠాధిపతి, తదితరులు

**ఘనంగా ఏర్పాట్లు**

జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈద్గాలో రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉండడం, ట్రాఫిక్‌ను ముందే మళ్లించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారు జాగ్రత్తలు తీసుకున్నారు.

- కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి, వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్‌ఏ కరిముల్లా, కడప నగర ముస్లిం ప్రముఖులు సయ్యద్ సలావుద్దీన్, అమీర్‌బాబు, అఫ్జల్‌ఖాన్, అరీఫుల్లా, పెద్దదర్గా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక విప్లవ యోధుడు జ్యోతిరావు పూలే





పూలేకు నివాళులు అర్పిస్తున్న రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

**కడప కార్పొరేషన్:** సామాజిక విప్లవ యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్ ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నతనంలో అనేక అవమానాలు ఎదుర్కొన్న జ్యోతిరావు పూలే అంటరానితనం, కులవ్యవస్థ, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. వితంతువులకు హాస్టల్ ఏర్పాటు చేశారన్నారు. తన భార్యను చదివించి ఉపాధ్యాయురాలిని చేసి మహిళోద్ధరణకు కృషి చేశారన్నారు. గాంధీ తర్వాత మహాత్మా అని పిలిపించుకున్న గొప్ప నాయకుడు పూలే అని కొనియాడారు. అట్టడుగున ఉన్న కులాల ప్రజలకు సమాన హక్కులు కల్పించడానికి సత్యశోధక్ సమాజాన్ని స్థాపించారని తెలిపారు. అంబేడ్కర్ గురువులలో పూలే ఒకరన్నారు. సామాజికత తత్వవేత్త, ఉద్యమకారుడైన మహాత్మా పూలేను ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు ఎస్. యానాదయ్య, పార్టీ నగర అధ్యక్షుడు ఎస్. సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జి. గరుడాద్రి, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివయాదవ్, ఎస్సీ, ఎస్టీ సెల్ నగర అధ్యక్షులు కె. వెంకట రమణ, కంచుపాటి బాబు, మల్లికార్జున, బాలస్వామిరెడ్డి, సంపత్, లక్ష్మినారాయణ, బండి మరియలు, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, సునీత, నారాయణమ్మ, సుశీలమ్మ, మల్లీశ్వరి, జింకా జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నయా జోష్!



- ప్రజా మద్దతు ఓవైపు.. నాయకుల ఆదరణ మరో వైపు
- ఊపుమీదున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- 5 పర్యాయాలు టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసనసిన వారిలో సైతం మార్పు
- టికెట్ కేటాయింపులో టీడీపీ ఫెయిల్
- నారా లోకేష్ మార్క్‌తో ఇన్‌చార్జీలకు మొండిచేయి

**సాక్షి ప్రతినిధి, కడప:** సామాన్యులకు మునుపెన్నడూ లేనివిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయి. ఎన్నికలు సమీపించే కొద్దీ ఆయా పథకాల లబ్ధిదారుల మద్దతు ఓవైపు, క్రమం తప్పకుండా నాయకుల చేరికలు మరోవైపు ఉండడంతో జిల్లాలో వైఎస్సార్‌సీపీ జోష్ మీదుంది. ఉమ్మడి జిల్లాలో పులివెందుల, కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగు, కడప, రాయచోటి నియోజకవర్గాల్లో ఫ్యాన్ హైస్పీడ్‌లో పరుగెడుతోంది.ఆ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఊపుమీదున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీలో నయా జోష్ కన్పిస్తోంది.

- తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా ప్రచారం చేసుకున్నవారికి టికెట్ దక్కలేదు. నారా లోకేష్ అభయంతో కొందరు, అధిష్టానం మాట ఇచ్చిందని కొందరు ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. తీరా అభ్యర్థిత్వం ఖరారు నాటికి జాబితాలో వారి పేర్లు గల్లంతయ్యాయి. అప్పటి వరకు టీడీపీ అంతా తామే అనుకున్న నేతలు తెరమరుగయ్యారు. అలాంటి వారి జాబితాలో గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బత్యాల చెంగల్‌రాయుడు, రమేష్‌కుమార్‌రెడ్డి, దొమ్మలపాటి రమేష్, శంకర్‌యాదవ్ తదితరులు ఉన్నారు. ఐదేళ్ల పాటు టీడీపీ ఇన్‌చార్జీగా పార్టీ ఉన్నతి కోసం పనిచేసిన ఆయా నాయకులకు అధిష్టానం మొండిచేయి చూపింది. దీంతో పలువురు నాయకులు తెరవెనుకకు వెళ్లాల్సిన దుస్థితి టీడీపీలో నెలకొంది. దిగువ స్థాయి కేడర్‌లో సైతం అయోమయం నెలకొంది.

**సుదీర్ఘకాలంలో టీడీపీలో పనిచేసిన నేతలు సైతం....**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ వచ్చిన నేతలు, అనేక పర్యాయాలు అభ్యర్థులుగా పోటీ చేసిన నాయకులు సైతం తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాంటి వారిలో ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, రెడ్డెప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ఆవిర్భావం నుంచి టీడీపీనే అంటిపెట్టుకొని ఉన్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, క్రియాశీలక నేతగా ఉన్న కమలాపురం సాయినాథశర్మలాంటి వారు కూడా టీడీపీ వీడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఆయా అభ్యర్థుల తలబిరుసు తనంతోనే కొందరు, అధిష్టానం తీరుతో మరికొందరు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాంటి వారి జాబితాలోకి వచ్చి చేరేందుకు మరికొందరు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో తెలుగుదేశం పార్టీ అత్తెసరు పోటీ ఇస్తున్న తరుణంలోఉన్నవారిని కూడా పోగొట్టుకొని అధికారపార్టీ కంటే వెనుకబడిందని విశ్లేషకులు సైతం వివరిస్తున్నారు.

**అయోమయంలో టీడీపీ అభ్యర్థులు...**



వరుస పరాజయపాలైన వారు కొందరు, అవకాశం కోసం ఎదురుచూపులు చూస్తున్న వారు మరికొందరు ఈమారు టీడీపీ అభ్యర్థులయ్యారు. ప్రజాక్షేత్రంలో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయ్యారు. అయితే అధిష్టానం చర్యల కారణంగా అయోమయ పరిస్థితి ఉత్పన్నమైంది. బీజేపీ పొత్తు గెలుపునకు ప్రధాన అడ్డంకిగా మారిందని పలువురు వాపోతున్నారు. ప్రతి నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీ ఓటర్లు గణనీయంగా ఉండడమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. స్వతహాగా వైఎస్సార్‌సీపీ పట్ల సానుకూలతతో ఉండడం ఒక ఎత్తయితే, బీజేపీలో టీడీపీ పొత్తులో ఉండడంతో ముస్లింల ఓట్లు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి అండగా నిలువనున్నట్లు విశ్లేషకులు వివరిస్తున్నారు. ప్రజామద్దతు, పార్టీలో చేరికలు సమీకరణలు నేపధ్యంలో కడప, రాజంపేట పార్లమెంటు పరిధిలో వైఎస్సార్‌సీపీ జోష్‌మీదున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

# చల్లంగా చూడమ్మా.. గంగమ్మా



గంగమ్మ జాతరలో భక్తజనసందోహం (ఇన్‌సెట్) భక్తులకు దర్శనమిచ్చిన గంగమ్మ

- అంబరాన్నంటిన జాతర సంబరం
- భారీగా తరలి వచ్చిన భక్తులు

**రాజంపేట టౌన్:** మున్సిపాలిటీలోని బలిజపల్లెలో గురువారం జరిగిన గంగమ్మ జాతర సంబరం అంబరాన్నంటింది. జాతర వేడుక బుధవారం అర్ధరాత్రి నుంచే ఆరంభమైంది. తొలుత జాతర నిర్వహణలో భాగస్వామ్యులైన నారపురెడ్డిపల్లె నిర్వాహకులు, ప్రజలు గంగమ్మ సోదరుడైన పోతురాజును ఊరేగిస్తూ అమ్మవారికి నవధాన్యాలు తీసుకొచ్చారు. అనంతరం తుమ్మల అగ్రహారానికి చెందిన మహిళలు పెద్దఎత్తున గండదీయలు తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆ గ్రామానికి చెందిన యువకులు తప్పెట్ల వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేయడం, బాణాసంచా కాల్చడంతో గ్రామంలో కోలాహలవాతావరణం నెలకొంది. కాగా నారపురెడ్డిపల్లె, తుమ్మల అగ్రహారం గ్రామాలకు చెందిన భక్తులు చేరుకోవడం, ఈలోపు అమ్మవారి ప్రతిమ తయారు కావడంతో బలిజపల్లెకు చెందిన బలిజపల్లె నిర్వాహకులు రథంలో గంగమ్మను ఊరేగిస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన వేపమండల గుడిలో కొలువుదీర్చారు. గంగమ్మను గుడిలోకి తీసుకొచ్చేందుకు ఊరేగిస్తున్న సమయంలో వందలాది మంది భక్తులు అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మా..గంగమ్మా కరుణించమ్మా అంటూ వరపడ్డారు. అమ్మవారిని గుడిలోకి తీసుకొచ్చే సమయంలో భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం దాదాపు కిలోమీటరు దూరంమేర క్యూలైనులో ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు త్వరపడటంతో పోలీసు అధికారులు, సిబ్బంది భక్తులను అదుపుచేసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

**దారులన్నీ జాతరవైపే**

బలిజపల్లె గంగమ్మ జాతరలో అమ్మవారికి వరపడితే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో బుధవారం అర్ధరాత్రి నుంచే భక్తులు బలిజపల్లె గ్రామానికి చేరుకునేందుకు నాలుగువైపుల ఉన్న దారుల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో పట్టణంలోని అన్ని ప్రాంతాలు కోలాహలంగా మారాయి.

**గంగమ్మను దర్శించుకున్న ఆకేపాటి, పోలా**

జాతర సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆకేపాటి, పోలా విలేకరులతో మాట్లాడారు. ఐదు సంవత్సరాలుగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనసాగించారని, మరోమారు ఆయనకు అవకాశం కల్పించాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురిపించి ప్రజలందరికి సిరిసంపదలు ఇవ్వాలని గంగమ్మకు వరపడినట్లు తెలిపారు. జాతర సందర్భంగా అనేక మంది మానవతా మూర్తులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. గంగమ్మ జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు బలిజపల్లె పరిసర ప్రాంతాలతో పాటు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఉచితంగా మంచినీటి, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పలువురు భోజనం, పులిహోర వంటి ఆహార పదార్థాలను భక్తులకు అందచేశారు.

# మళ్లీ పెరుగుతున్న టమాట ధరలు

- మార్కెట్‌లో కిలో రూ.30
- వారం రోజుల్లో 50 శాతం పెరిగిన ధర
- రాబోయే రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం

**గుర్రంకొండ(అన్నమయ్య జిల్లా) :** జిల్లాలోని మార్కెట్‌లో టమాట ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం కిలో రూ.30 వరకు పలుకుతున్నాయి. వారం రోజుల క్రితం రూ.12 నుంచి రూ.14 వరకు మాత్రమే ఉండేవి. వారం రోజుల్లోనే 50 శాతానికి పెరిగాయి. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఎండలకు దెబ్బతిన్న తోటలు**

రాయలసీమతోపాటు బయట రాష్ట్రాల్లో ప్రస్తుతం వేసవి ఎండలకు టమాట తోటలు దెబ్బతిన్నాయి. దీంతో అక్కడ దిగుబడులు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. అయితే మన జిల్లాలో ముఖ్యంగా పడమటి మండలాల్లో ఎంతో కొంత దిగుబడి వస్తోంది. దీంతో ఇప్పుడిప్పుడే మార్కెట్లో టమాట ధరలు పుంజుకొంటున్నాయి. జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రస్తుతం 13565 ఎకరాల్లో టమాట పంట దిగుబడి వస్తోంది. రాయలసీమ వ్యాప్తంగా ఏప్రిల్, మే, జూన్ నెలల వరకు దిగుబడి అంతగా రాదు. అధిక ఎండల కారణంగా బయట జిల్లాల్లో టమాటల పంట సాగవదు. పడమటి మండలాల్లోనే ఎండ వేడమికి తట్టుకొని కొంత మేరకు సాగు అవుతుంది. అయితే గతేడాదితో పోల్చితే ఎండలు ఎక్కువగా ఉండటంతో టమాట తోటలను కాపాడుకోవడం కోసం రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారు.

**1600 నుంచి 720 మెట్రిక్ టన్నులకు పడిపోయిన స్టాక్**

మన జిల్లాలో 15 రోజుల క్రితం 1600 మెట్రిక్ టన్నుల టమాటల స్టాకు మార్కెట్లకు వచ్చేది. వేసవి అధిక ఎండలకు తోటలు దెబ్బతిని ప్రస్తుతం 720 మెట్రిక్ టన్నుల స్టాకు మాత్రమే వస్తోంది. గత నెలలో టమాట పంటల సాగు గానీ, దిగుబడులు గానీ ఎక్కువగా ఉండేది. రోజురోజుకు పెరిగిపోతున్న ఎండల ప్రభావంతో టామాట తోటల్లో దిగుబడి తగ్గిపోతోంది. దీంతో రోజురోజుకు జిల్లాల్లో మార్కెట్లలో టమాటల స్టాకు భారీగా తగ్గిపోతుండటం గమనార్హం.

**పుంజుకుంటున్న ధరలు**

ప్రస్తుతం జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో టమాట ధరలు పుంజుకొంటున్నాయి. వారం రోజుల కిందట కిలో రూ.12 నుంచి రూ.14 వరకు పలికాయి. 25 కేజీల క్రీట్ రూ.300 నుంచి రూ.350 వరకు పలికాయి. ప్రస్తుతం మార్కెట్లో ధరలు పుంజుకోవడంతో కిలో రూ.30 వరకు పలుకుతున్నాయి. 25 కేజీల క్రీట్ రూ.750 వరకు పలుకుతోంది. మొదటి రకం కిలో రూ.30, రెండో రకం రూ.24, మూడో రకం రూ.18 వరకు పలుకుతున్నాయి.



మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటలు

**ధరలు మరింత పెరిగే అవకాశం**

రాబోయే రోజుల్లో టమాట ధరలు మరింతగా పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఎండలకు టమాటలపై బొబ్బలు, మెత్తబడిపోవడం జరుగుతోంది. దీంతో బయట రాష్ట్రాలకు తరలించే అవకాశముండదు. బయట రాష్ట్రాలకు తరలించాలంటే కనీసం 4 నుంచి 6 రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న టమాటలు రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు స్టాకు ఉంచుకొనే పరిస్థితి లేదు. దీంతో బయట రాష్ట్రాల్లో అధిక డిమాండ్ ఏర్పడి.. ఇక్కడ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

వారం రోజులుగా జిల్లాలోని మార్కెట్లకు వచ్చిన స్టాకు, ధరల వివరాలు

| తేదీ | స్టాకు (టన్నుల్లో) | ధరలు (25 కేజీల క్రీట్) |
|---|---|---|
| 5 | 1585 | 350 |
| 6 | 1495 | 400 |
| 7 | 1367 | 485 |
| 8 | 1145 | 575 |
| 9 | 976 | 650 |
| 10 | 834 | 690 |
| 11 | 714 | 750 |

**ఎండలకు తగ్గిన దిగుబడి**



ప్రస్తుతం టమాట ధరలు బాగా పుంజుకొన్నాయి. మార్కెట్లో ప్రస్తుతం కిలో ధర రూ.30 వరకు పలుకుతున్నాయి. ఎండలు ఎక్కువగా ఉండడం, టమాట దిగుబడి తగ్గిపోతుండడం ధరల పెరగడానికి కారణంగా చెప్పుకోవచ్చు. గతంలో ప్రతి రోజు టమాట మార్కెట్లకు 1600 మెట్రిక్ టన్నుల స్టాకు వచ్చేవి. ప్రస్తుతం 720 మెట్రిక్ టన్నుల స్టాకు మాత్రమే మార్కెట్లకు వస్తోంది.

**- కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం**





వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

**సులభతరంగా ధ్రువపత్రాలు**



గతంలో మా పిల్లల కోసం ఏవైనా ధ్రువపత్రాలు పొందాలంటే మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుని వారం. అనంతరం పత్రాలు చేదికందాలంటే మీసేవా, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అయితే ఈ ప్రభుత్వ హయాంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం గ్రామ వలంటీర్‌కు తెలపడం జరిగింది. ధ్రువపత్రాలు ఒక్కరోజులోనే మా ఇంటి వద్దకు తెచ్చి ఇచ్చారు. సులభంగా పత్రాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

**- ఆర్.హుస్సేన్‌బీ, దుర్గానగర్, పీలేరు**

**సొంతింటి కల నెరవేరింది**



మేము పట్టణంలోని రోటరీపురంలో కొనేళ్లుగా అద్దె ఇంటిలో నివసిస్తున్నాం. సొంతింటి కోసం అనేక మార్లు దరఖాస్తు చేసుకున్నా.. ఆ కల నెరవేరలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా పేదల సొంతింటి కల నెరవేర్చడానికి జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. అందులో భాగంగా నాకు ఇల్లు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటాం.

**- అనీషా, రోటరీపురం, పులివెందుల**



# వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- పథకం ప్రకారం భర్తపై ఎల్ఐసీ ఇన్సురెన్స్
- ప్రియుడితో కలిసి చంపేసిన భార్య
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- పోలీసు విచారణలో వెల్లడి



రాంబాబు (ఫైల్)



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యశ్వంత్

**ఎర్రగుంట్ల :** తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి.. భర్తను ప్రియుడితో కలిసి ఓ మహిళ అంతమొందించింది. ఈ ఘటనలో పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. గురువారం సాయంత్రం జమ్మలమడగు డీఎస్పీ యశ్వంత్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎర్రగుంట్ల పట్టణంలోని ఎర్రబ్బచేనులో నివాసం ఉండే రాంబాబు(32) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ముద్దనూరు మండలం యామారం గ్రామానికి చెందిన మాధవితో వివాహం అయింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. అయితే మాధవికి రెండేళ్ల నుంచి గాజుల భరత్‌బాబు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. ఆ విషయం తెలుసుకున్న రాంబాబు తరచూ తన భార్యను కొట్టడం, తిట్టడం చేస్తుండే వాడు. దీంతో మాధవి తన తల్లి లక్ష్మీదేవితో విషయం చెప్పి ఎలాగైనా రాంబాబు అడ్డు తొలగించాలని చెప్పింది. అందుకు భరత్‌బాబుతో కలిసి పథకం వేశారు. రాంబాబుకు నచ్చజెప్పి రూ.20 లక్షలకు ఎల్ఐసీ చేయించారు. రాంబాబును చంపి వచ్చిన ఎల్ఐసీ ఇన్సురెన్స్ డబ్బులు పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు గాను రాంబాబును చంపేందుకు యాకాసి కిరణ్‌కుమార్, బెల్లంకొండ చిన్నరాజ సహకారం తీసుకున్నారు. ఈ నెల 2వ తేదీన మద్యం తాగుదామని చెప్పి రాంబాబును నిడుజివ్వి గ్రామ వద్ద ఉన్న నాపరాయి గనుల వద్దకు రావాలని చెప్పారు. మద్యం తాపించి అతని గొంతును టవల్‌తో బిగించి, ఇనుప రాడ్డుతో కొట్టి చంపారు. శవాన్ని రోడ్డు పక్కన పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని ప్రయత్నించారు. అయితే విచారణ చేపట్టిన సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐ చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాంబాబును పథకం ప్రకారం చంపినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో నిందితులైన భరత్‌బాబు, మాధవి, లక్ష్మీదేవి, కిరణ్ కుమార్, మునయ్య, చిన్నరాజును అరెస్టు చేసి, మూడు మోటర్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచారు. ఈ కేసును అతి కొద్ది రోజులలోనే ఛేదించిన సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐ చిరంజీవిలను అభినందిస్తున్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు.

## రైలు కిందపడి ఇద్దరు మృతి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** వేర్వేరు ప్రాంతాల్లో రైలు కింద పడి ఇద్దరు మృతి చెందారు. రైల్వే సీఐ నాగార్జున తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరానికి చెందిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ జ్ఞానగిరి వెంకట సుబ్బయ్య(72) గురువారం ఉదయం అంగడివీధి నుంచి టౌన్‌లోకి నడుచుకుంటూ వెళ్తూ.. కడప రైల్వేస్టేషన్ యార్డు వద్ద ప్రమాదవ శాత్తు గుర్తు తెలియని రైలు కింద పడి మరణించాడు. సిద్దవటం గ్రామానికి చెందిన పాలెంరెడ్డి రాంమోహన్(18) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది బుధవారం అర్ధరాత్రి భాకరాపేట-కనుమలోపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు పట్టాలపై తల ఉంచి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనవసరంగా బయట తిరుగుతున్నావని తల్లిదండ్రులు మందలించినందుకు ఆత్యహత్య చేసుకున్నాడని సీఐ వివరించారు. ఇద్దరి మృతదేహాలను రిమ్స్‌కు తరలించారు. కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



మృతి చెందిన వెంకటసుబ్బయ్య

# మృత్యువులోనూ 'తోడు'గా..

**వారిద్దరూ అన్నదమ్ములు. ఒకే మాట.. ఒకే బాటగా ఉంటూ తోడుగా ముందుకెళ్తుండేవారు. కలిసే నిర్ణయాలు తీసుకునేవారు. వారి ఐకమత్యాన్ని అందరూ అభినందించేవారు. ఆ అన్యోన్యతను చూసిన విధికే కన్ను కుట్టిందేమో.. ఇద్దరి ప్రాణాలనూ ఒకేసారి తీసుకుపోయింది.**

గాయపడిన ఇద్దరు అన్నదమ్ములు మృతి



శశిధర్‌రెడ్డి (ఫైల్)



జగదీశ్వర్‌రెడ్డి (ఫైల్)

**సింహాద్రిపురం :** సింహాద్రిపురానికి చెందిన బైక్ మెకానిక్ మోహన్‌రెడ్డి, ఉమాదేవి దంపతులకు శశిధర్‌రెడ్డి(30), జగదీశ్వర్‌రెడ్డి(28) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. శశిధర్‌రెడ్డి యురేనియం సంస్థలో పని చేస్తుండగా, జగదీశ్వర్‌రెడ్డి తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చాడు. చేతికొచ్చిన కుమారులకు పెళ్లిళ్లు చేసి, ఒక ఇంటి వారిని చేయాలని కలలు కన్నారు. కానీ వారి కోరిక తీరకుండానే.. కుమారులిద్దరూ తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో శోక సంద్రంలో మునిగిపోయారు. 'అయ్యో.. ఎంత పని చేశావు.. దేవుడా' అంటూ వారు గుండెలవిసేలా రోదించారు. ఈ విషాదకర సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శశిధర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి బుధవారం ఉగాది పార్వ సందర్భంగా ముద్దనూరులోని తమ బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి కమలాపురంలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లడానికి బైక్‌పై బయలుదేరారు. ముద్దనూరు సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో.. ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరిద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ సంఘటన రాత్రి చోటుచేసుకుంది. బాధితులను ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించింది. గంట తేడాతో ఒకరి తర్వాత ఒకరు మరణించారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. వారి మృతదేహాలను గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. మృతి చెందిన కుమారులను చూసి తల్లిదండ్రులతోపాటు చుట్టుపక్కల వారు కన్నీటి పర్యంతం అయ్యారు. పండుగ రోజు ఇలా అన్నదమ్ములు మృత్యువాత పడడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు తమ ఇద్దరు కుమారులను ఒకేసారి కోల్పోవడంతో వారి బాధ వర్ణనాతీతం. వారి రోదనను ఆపడం చూసిన వారి వల్ల కూడా కాలేదు.

# టీడీపీ నేతల తీరుపై ఆ పార్టీ మహిళల ఆగ్రహం

- మా కాలనీ వాసిని కొట్టారని మండిపాటు
- మాకు న్యాయం చేయాలని ఆందోళన



మాసాపేట సర్కిల్‌లో ఆందోళన చేపట్టిన స్థానిక టీడీపీ మహిళా నేతలు

**కడప అర్బన్ :** కడప నగరంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు తమ ప్రచార సమయంలో వాహనంపై రాళ్లు వేశారని నానా రాద్ధాంతం చేద్దామని ప్రయత్నించారు. సంఘటనపై వాస్తవాలు తెలుసుకోకుండా బురదచల్లే ప్రయత్నం చేసి చతికిల పడ్డారు. చివరికి తమ పార్టీకి చెందిన మహిళా నాయకులు, దళిత మహిళల ఆవేదనాగ్రహాలకు గురయ్యారు. ఈ సంఘటన వివరాలిలా వున్నాయి. గురువారం టీడీపీ కడప అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన రెడ్డెప్పగారి మాధవీరెడ్డి, ఆమె భర్త పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులరెడ్డికి సంబంధించిన ప్రచార రథం కడప నగరంలో సంచరిస్తూ వుంటుంది. ఆ వాహనం డ్రైవర్ ప్రశాంత్ గురువారం సాయంత్రం డీజే ద్వారా ప్రచారం చేసుకుంటూ మాసాపేట సర్కిల్‌లోకి వచ్చి ఆపాడు. ఆ సమయంలో స్థానికంగా వున్న మహిళా టీడీపీ నేతల కుటుంబాలకు చెందిన కొందరు పిల్లలు ఉత్సాహంగా వాహనం ఎక్కారు. ఆ పిల్లలలో ఓ పిల్లాడి తండ్రి, టీడీపీ వీరాభిమాని కిషోర్ తన కుమారుడిని మందలించాలని, ఓ రాయిని తీసుకుని విసిరాడు. ఆ రాయి పొరపాటున ప్రచారరథం వాహనంపైకి పడి, లైటు పగిలిపోయింది. దీంతో ప్రచార రథం డ్రైవర్ ప్రశాంత్ స్థానికంగా వున్న వారితో కలిసి దాడి చేశారు. దీంతో స్థానికంగా వున్న టీడీపీ మహిళా నేతలు, స్థానిక ప్రజలతో కలిసి మాసాపేట సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. టీడీపీ కోసం తాము అహర్నిశలు శ్రమించామని, అలాంటి తమ ప్రాంతానికి వచ్చి కిషోర్‌పై దాడి చేయడం తగదన్నారు. దళిత మహిళలు, స్థానిక టీడీపీ మహిళా నేతలు విజయలక్ష్మి, చిప్పగిరి మీనాక్షి, స్వర్ణలత, ఇతర మహిళా నేతలు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమగ్రంగా విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సంజీవరాయుడు పేర్కొన్నారు.



# టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



కడప కార్పొరేషన్: వైఎస్సార్సీపీలో చేరిన మైనార్టీ నాయకులతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మైదుకూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

**కడప కార్పొరేషన్ :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరుతున్నారు. గురువారం కడప నగరంలోని 31వ డివిజన్ రాజాఖాన్ బాగ్ మసీదు సమీపంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెట్టి ఇంటి వద్దకే వాటిని అందించారని తెలిపారు. ముస్లిం మైనార్టీల పక్షపాతిగా వారికి రాజకీయంగా, ఆర్థికంగా గుర్తింపు తెచ్చారని తెలిపారు. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఇఫ్తికార్ , గౌస్, జాకీర్, సమీర్, జాఫర్ సాబ్, ఖాదర్ భాషా వారి మిత్ర బృందం ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్సీ అహ్మద్ బాషా, అర్షద్ భాష, షేక్ ఉమైర్, దేవిరెడ్డి ఆదిత్య, కార్పొరేటర్లు అజ్మతుల్లా, షఫీ, కో ఆప్షన్ సభ్యులు హారున్ బాబు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఇబ్రహీం మియ్యా, రిజ్వాన్, అల్లా బకాష్, షేక్ జమీల్, ముష్తాక్, సోహెల్, జాకీర్, అఖిల్, జిలాన్, గౌస్ పాల్గొన్నారు.

**మైదుకూరులో 50 కుటుంబాలు..**

**మైదుకూరు :** మైదుకూరు మున్సిపాలిటీలో టీడీపీ కార్యకర్తలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక 15వ వార్డులోని ఎస్సీ బాలికల హాస్టల్ వెనుక వీధిలో వార్డు ఇన్‌చార్జి సన్నా శ్రీనురావు ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డులోని టీడీపీకి చెందిన తుపాకుల శ్రీనివాసులు, తుపాకుల రాజా, తుపాకుల వెంకటేష్, బత్తల కిషోర్, బత్తల అశోక్, తిరుపతి వీరమోహన్, తిరుపతి రాజేశ్వరి, తుపాకుల కల్ప, తుపాకుల దేవి, బత్తల గంగాదేవి, ఇడగొట్టు శ్రీనివాసులు, ఇడగొట్టు అంజనమ్మ, ఇడగొట్టు బాలరాజు, ఇడగొట్టు లక్ష్మీదేవి, ఇడగొట్టు గోపాల్ తదితర 50 కుటుంబాల వారికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి సన్న శ్రీనురావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దండు సుబ్బయ్య, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, సర్పంచ్ అన్నలూరు శ్రీనివాసులు రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చుక్కబొట్టు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

**బద్వేలు మండలంలో 40 కుటుంబాలు..**

**బద్వేలు అర్బన్ :** మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీలోని తిమ్మరాజుపల్లె, నక్కలగండి గ్రామాల నుంచి పంచాయతీ ఉప సర్పంచ్ కుప్పాలరమణ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన తోడేటి రామయ్య, తోడేటి జయరామ్, మైలవెంకటసుబ్బయ్య, ఓబులమ్మ, డీకాలఓబయ్యలతోపాటు 40 కుటుంబాలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని కుడా చైర్మన్ గురుమోహన్ ఇంటి ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన కుటుంబాలకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు పెద్ద ఎత్తున ఆకర్షితులవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సింగసాని గురుమోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ నాయకులు ప్రసాద్, రామసుబ్బయ్య, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## పాము కాటుతో రైతు మృతి

**లింగాల :** మండలంలోని మురారిచింతల గ్రామానికి చెందిన పిట్టు పెద్దిరెడ్డి (47) అనే రైతు పాము కాటుకు గురై మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పిట్టు పెద్దిరెడ్డి బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అరటి తోటలో గేట్‌వాల్ తిప్పేందుకు వెళ్లాడు. గేట్‌వాల్ తిప్పుతుండగా పాము కాటుకు గురై మృతి చెందాడు. రాత్రి వెళ్లిన పెద్దిరెడ్డి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఉదయాన్నే వారి కుటుంబ సభ్యులు తోట వద్దకు వెళ్లి పరిశీలించారు. వెంటనే ఆయనను పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి సోదరుడు ఓబులరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పొగాకు గోడౌన్ దగ్ధం

**ఖాజీపేట :** ఖాజీ పేటలోని ఫాయాజ్ టోబాకో మిల్‌లో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి పొగాకు పూర్తిగా కాలిపోయింది. రంజాన్ కారణంగా మిల్ మూసివేయడంతో పని చేసే కూలీలు ఎవరూ లేక పోవడంతో ప్రమాదాన్ని గుర్తించలేకపోయారు. దీంతో మంటలు ఎక్కువై పొగాకు కాలిపోయింది. గమనించిన స్థానికులు మైదుకూరులోని ఫైర్ ఇంజన్ వారికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి గోడౌన్‌లోని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని యజమాని ఫయాజ్ తెలిపారు.

## వ్యక్తి అరెస్ట్

**కడప అర్బన్ :** కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో రాజేష్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద 50 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.